## క్లుప్తంగా

### కొనసాగుతున్న సమ్మె



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వీవోఏలు చేపడుతున్న సమ్మె ఆదివారం 21వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె విరమించమని వీవోఏలు పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు.

### ఆర్థిక సాయం అందజేత



ఖలీల్‌వాడి(డిచ్‌పల్లి): డిచ్‌పల్లి మండలం నడిమితండా, గొల్లమాట్ తండాల్లో ఇటీవల ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఇళ్లు ధ్వంసమైన గిరిజనులకు ఆదివారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. రెండు గిరిజన తండాలను సందర్శించి బాధితులకు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజులుగా విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనుల సమస్యను వెంటనే పరిష్కారించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ రెండు తండాల్లో ఎక్కువ నష్టం జరిగిందన్నారు. గిరిజనులను ప్రభుత్వం ఆదుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, నడిపల్లి ఎంపీటీసీ నర్సయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, నాయకులు ఏగొండ, గంగారెడ్డి, సాయిలు, రమేష్ తదితరులున్నారు.

### అమ్మను గౌరవిస్తే అన్నీ విజయాలే




నిజామాబాద్‌నాగారం: మానవజీవన మనుగడకు సృష్టిమూలమైన అమ్మ, జగతి ప్రగతికి తొలిసంతకంగా నిలుసస్తుందని, అమ్మను గౌరవిస్తే అన్నీ విజయాలేనని, ఇందూరు కవులు అమ్మ మీద కవిసమ్మేళనం నిర్వహించడం అభినందనీమమని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ముఖ్యతిథిగా డాక్టర్ ప్రతిమారాజ్, తెయా ప్రొఫెసర్ త్రివేణి మాట్లాడుతూ.. మాతృమూర్తి, మాతృభాష, మాతృదేశం అనే భావనలు చాలా గొప్పవని వ్యాఖ్యానించారు. సభాధ్యక్షులుగా వసంతలక్ష్మణ్, విశిష్ట అతిథులుగా పద్మావతి, షేర్ల సుజాత, విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఈ కవిసమ్మేళనంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారులు, కవి, డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, సిర్ప లింగం, బాలిష్ట మల్లేశ్, మల్లవరపు చిన్నయ్య, దారం గంగాధర్, తదితరులు పాల్గొని తమ కవితలలో అమ్మకు నీరాజనం పలికారు.

### ముదిరాజ్ యూత్ కార్యవర్గం

ఖలీల్‌వాడి: నగరంలోని ముదిరాజ్ యూత్ కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మోత్కు మాధవ్ ఆదివారం తెలిపారు. అలాగే ఏకగ్రీవంగా ఎన్నికైన యూత్ కమిటీ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా భానపురం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా పెందారి గణేష్, కోశాధికారిగా బినకారి త్రివేందర్, ఉపాధ్యక్షులుగా సాయిప్రసాద్, రాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రతాప్ తదితరులున్నారు.

### లక్ష్మీప్రియ నగర్-2 వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్: నగరంలోని లక్ష్మీప్రియ నగర్- 2 వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని కాలనీ సభ్యుల సమక్షంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు కాలనీ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యవర్గం జనవరి-1, 2026 వరకు కొనసాగుతోంది. ఈసందర్భంగా అధ్యక్షుడు ఆకుల ప్రతాప్ మాట్లాడుతూ.. కాలనీవాసుల సహకారంతో అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**నూతన కమిటీ..**

లక్ష్మీప్రియ నగర్ -2 వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా ఆకుల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా లోక శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాథోడ్ ప్రతాప్ సింగ్, సహాయ కార్యదర్శిగా సీహెచ్ నవీన్ కుమార్, కోశాధికారిగా మాటి కొండ రవి, సలహాదారులుగా సోమేష్ కుమార్, ప్రభాకర్, మల్లేష్ ఎన్నికయ్యారు.

# డబుల్ పూర్తయ్యేదెప్పుడో!



మెండోరా మండల కేంద్రంలో కొనసాగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు

- మెండోరా మండల కేంద్రంలో ఆరేళ్లుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

బాల్కొండ: పేద వాడి సొంతింటి కలను సాకారం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూంల ఇళ్ల నిర్మాణం మెండోరా మండల కేంద్రంలో ఎప్పుడు పూర్తవుతాయోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మండల కేంద్రంలో 60 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 2017లో రూ.3 కోట్ల 77 లక్షల 40 వేలను మంజూరు చేసింది. అదే సంవత్సరం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆరేళ్ల నుంచి ఇప్పటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం 60 ఇళ్ల నిర్మాణాల స్లాబులు పూర్తయ్యాయి. ప్లాస్టరింగ్ పనులు కొనసాగుతున్నాయి. గత జనవరి మాసంలోనే డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. కాని ఇప్పటి వరకు నిర్మాణమే పూర్తి కాక పోవడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు వేగంగా చేపడితే మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైతే మళ్లీ పనులు అటకెక్కుతాయని వాపోతున్నారు.

### నత్త నడకన పనులు

డబుల్ బెడ్ రూం నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. మధ్యలో కొంత కాలం పనులు నిలిచిపోయాయి. పనులు మూడు నెలలు ముందుకు, ఆరు నెలలు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. దీంతో ఆరేళ్లు అయినా అసంపూర్తిగానే ఉన్నాయి. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం కనిపించినా అధికారులు చర్యలు తీసుకోలేదు. గత వర్షా కాలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల గోడలు కూలిపోయాయి. పనులు నత్తనడకన, నాణ్యత లోపంగా సాగుతున్నా అధికారులు మిన్నకుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వెంటనే నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### రెండు నెలల్లో పూర్తి చేస్తాం

మెండోరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను 2 నెలల్లో పూర్తి చేస్తాం. పనులు వేగంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. నాణ్యతలో లోపం ఉంటే చర్యలు తీసుకుంటాం. – వినీత్, ఆర్అండ్‌బీ ఏఈ, బాల్కొండ

## అమ్మ జ్ఞాపకార్థం రూ.5కే భోజనం



అన్నం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

బోధన్‌టౌన్(బోధన్): అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి తన తల్లి శివమ్మ జ్ఞాపకార్థం తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతినగర్‌కాలనీలో రూ.5కే భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని తన సతీమణి, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శరత్ రెడ్డి మాట్లాడారు. మాతృ దినోత్సవం సందర్భంగా మా అమ్మ శివమ్మ జ్ఞాపకార్థం నిరుపేదల ఆకలి తీర్చడానికి భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. సరస్వతినగర్ కాలనీలో ఆస్పత్రులు ఎక్కువగా ఉన్నాయని, వైద్యం నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ భోజన కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు భోజనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి స్థలాన్ని ఇచ్చిన బీర్కూర్ దేవయ్య, అజయ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రవీందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### వధూవరుల పరిచయ వేదికను జయప్రదం చేయండి



కమ్మర్‌పల్లి: నిర్మల్ జిల్లా బాసరలో ఈ నెల 28న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గాండ్ల తేలికుల వధూవరుల వివాహ పరిచయ వేదికను జయప్రదం చేయాలని కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి గంగోళ్ల ప్రళయ్ తేజ్ కోరారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులబాంధవులు పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిచయ వేదిక అధికార ప్రతినిధి బోడగుడ్డు కమలాకర్, గాండ్ల సంఘం మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సీఎం కప్ టోర్నీ

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో సోమవారం నుంచి సీఎం కప్ మండల స్థాయి టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోలు సంతోష్‌కుమార్, దామోదర్, శ్రీనివాస్‌లు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. గ్రామాల్లో 16 నుంచి 36 ఏళ్ల యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

– ఈ నెల 17న కలెక్టరేట్ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న భూస రాజన్న

ఆర్మూర్‌టౌన్: యాదవ కులస్తులను కించపరుస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఈ 17న యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు భూస రాజన్న యాదవ్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాదవ, కురుమల కులవృత్తిని కించపరుస్తూ, యాదవ సామాజిక వర్గానికి చెందిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా జనరల్ సెక్రెటరీ బుజ్జ మహేందర్ యాదవ్, యువజన సంఘం, జిల్లా అధ్యక్షుడు జక్కుల రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అడుగుకో గుంత.. తీరేదెప్పుడు చింత!

- ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల మధ్య రోడ్డు దుస్థితి
- గుంతలతో ప్రయాణికులకు తిప్పలు



ముప్కాల్ - మెండోరా రోడ్డులో ఏర్పడిన గుంతలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం నుంచి మెండోరా మండల కేంద్రం వరకు గల బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈ రోడ్డు 2017లో తారు రోడ్డుగా మార్చారు. వేసిన నెల రోజులకే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అధికారులు పై పై మెరుగులు దిద్దారు. కానీ గుంతలు ఏర్పడటం మాత్రం తగ్గలేదు. అప్పటి నుంచి రోడ్డుపై ఎక్కడో ఓ చోట గుంతలు ఏర్పడుతూనే ఉన్నాయి. కానీ మరమ్మతులకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది.

రెండు మండల కేంద్రాల మధ్య గల రోడ్డు కావడం, జాతీయ రహదారి 44 నుంచి మెండోరా వెళ్లడానికి దూరా భారం తగ్గించే రోడ్డు కావడంతో నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మార్గంలోనే గతంలో బావిలోకి ఆటో దూసుకెళ్లి 11 మంది జల సమాధి అయ్యారు. ప్రస్తుతం గుంతలు అధికంగా ఉండటం వలన ప్రమాదం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే రోడ్డు త్వరగా గుంతలు తేలిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలతో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### త్వరలో మరమ్మతులు చేపడతాం

మెండోరా, ముప్కాల్‌ల మధ్యగల తారు రోడ్డుకు మరమ్మతులు త్వరలో చేపడతాం. ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రోడ్డుపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు అధికంగా తిరగడం వల్ల రోడ్డు ధ్వంసమైంది. కేజ్‌వీల్ ట్రాక్టర్లు పట్టీలు లేకుండా తారు రోడ్లపై స్థానికులు బాధ్యత తో వ్యహరించి అధికారులకు సమాచారమివ్వాలి. – మహేందర్‌రెడ్డి, పంచారాజ్ డీఈఈ, బాల్కొండ

## ఆవుల తరలింపుపై కఠినంగా వ్యవహరించాలి

- హిందూ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ధాత్రిక రమేశ్



మాట్లాడుతున్న ధాత్రిక రమేశ్, ఇతర నాయకులు

సుభాష్‌నగర్: నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కొందరు గుర్తు తెలియని దుండగులు ఆవులను షిఫ్ట్ కారులో తరలిస్తున్నారని, అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని హిందూ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ధాత్రిక రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి షిఫ్ట్ కారులో తరలించేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈ దృశ్యాన్ని గమనించిన హిందూ వాహిని కార్యకర్తలు వారి వెంట పడి పట్టుకునేందుకు వెంబడించారన్నారు. దుండగులు కారుతోపాటు మొబైల్‌ను అక్కడే వదిలేసి పారిపోయారని పేర్కొన్నారు. మూడోటౌన్ పోలీస్‌స్టేషన్లో వారిపై ఫిర్యాదు చేశామన్నారు. ఎంహెచ్06ఏఎఫ్2594 నెంబర్ కారులో నలుగురు దుండగులు ఆవుకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి తరలిస్తున్నారని తెలిపారు. ఫోన్‌నెంబర్ ఆధారంగా మహారాష్ట్రలోని బిలోలి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించామని, కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. నాయకులు అనిల్ కదమ్, శ్రీకాంత్, రణధీర్, బాబు అర్జున్, గజానన్, తదితరులు పాల్గొన్నారు.



ఆవుకు మత్తు మందు ఇచ్చి కారులో తరలిస్తున్న దృశ్యం

## హైందవ ధర్మం గురించి తెలియజేయాలి



భక్తులతో మాట్లాడుతున్న పిట్ల కృష్ణ మహరాజ్

బోధన్‌టౌన్(బోధన్) : నేటి తరం పిల్లలకు హైందవ ధర్మ గొప్పదనం, సంస్కృతి సాంప్రదాయాలను గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందని మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. ఆదివారం శక్కర్‌నగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంతో పాటు హనుమాన్ జయంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలో పిల్లలకు ధర్మంతో కూడిన విద్యను నేర్పించాలని, పురాణ ఇతిహాసాలను గురించి వారికి తెలియజేయాలని, తల్లిదండ్రుల మాటలు వినేలా చూడాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## రైతుల సమస్యలపై రాజకీయాలొద్దు



రైస్‌మిల్లు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

- పార్టీలకు అతీతంగా అండగా నిలుద్దాం
- కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నేత బుచ్చెల్‌వార్ రవి

బోధన్‌రూరల్(బోధన్): అకాల వర్షాలతో పంటలను నష్టపోయి ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలపై రాజకీయాలు వద్దని, పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ రైతులకు అండగా నిలిచి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ బోధన్ మండలాధ్యక్షుడు బుచ్చెల్‌వార్ రవి అన్నారు. సాలూరలోని రైస్‌మిల్లు వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చెల్‌వర్ రవి మాట్లాడుతూ..వర్షాలతో ధాన్యం తడిసి, రంగుమారి, మొలకలు వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 15, 20 రోజుల నుంచి రైతులు పగలు, రాత్రి తేడా లేకుండా ప్రభుత్వ నిబంధనాల ప్రకారం ధాన్యం తేమ శాతం వచ్చే వరకు ఎండబెట్టారని, ఇప్పుడు మళ్లీ రైస్‌మిల్లర్లు ధాన్యం కాంటాలు చేసిన తర్వాత తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని వాపోయారు. ఇబ్బందులు పెడుతున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తరుగు లేకుండా ధాన్యాన్ని తీసుకుని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే షకీల్ రైతుల ఇబ్బందులపై దృష్టి సారించి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఖాజాపూర్ అశోక్, చిల శంకర్, రమేష్, చిద్రపు అనిల్, చీల ప్రకాష్, మురిగె శంకర్ పాల్గొన్నారు.

## సమాచారం..

### పోచమ్మా.. సల్లంగా సూడమ్మా..



బాల్కొండ: జలాల్‌పూర్‌లో ఆదివారం పోచమ్మా... సల్లాంగా సూడమ్మా అంటూ నల్ల పోచమ్మకు గోదావరి నీళ్లతో గ్రామస్తులు అభిషేకం నిర్వహించారు. ముందుగా పవిత్ర గోదావరికి కాలినడకన వెళ్లి గోదావరి జలాలను తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో వలగొడుగు, డప్పువాయిద్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పాటి హన్మాన్ దేవాలయం స్వాగత తోరణం వద్ద జగిత్యాలకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బొడ్ల నాగయ్య, భాగ్యలక్ష్మి దంపతులు తమ సొంత వ్యయంతో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని స్థానిక సర్పంచ్ గడ్డం స్వామి ఆవిష్కరించారు. అనంతరం పురోహితులు పూజ కార్యక్రమాలతో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు వంజరి రాజ్‌కుమార్, డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్, చిటికేశి రఘు, డిష్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



వేల్పూర్: పోచంపల్లిలో ఆదివారం హనుమాన్ జయంతిని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు.

### నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు


ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిలో ఊరేగింపు ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## స్వచ్ఛత, ఐక్యత కార్యక్రమానికి శ్రీకారం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛత, ఐక్యత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ నేత గోసికొండ అశోక్ మాట్లాడుతూ.. అభివృద్ధి కమిటీ ప్రతి ఆదివారం స్వచ్ఛత, ఐక్యత కోసం స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్ణయించామన్నారు. కాలనీవాసులు ప్రధాన రోడ్డుపై చెత్తను ఊడ్చారు. మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా నిలిచిన రాళ్లను, ప్లాస్టిక్ కాగితాలను, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. మురుగు కాలువలలో వ్యర్థాలు వేయొద్దని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు కమలాకర్, సత్యనారాయణ గౌడ్, కొక్కెర భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్(నిజామాబాద్ సిటీ)**

స్క్రీన్-1 – కథ వెనుక కథ - 10.35
ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటిఫుల్ గర్ల్ - 1.15
గార్డియన్స్ ఆఫ్ ది గలాక్సీ (ఇంగ్లిష్) - 4.10
ఛత్రపతి (హిందీ) - 7.25
సంగీతం స్కూల్ - 10.10

స్క్రీన్-2 – కస్టడీ 10.00, 1.10, 4.20, 7.30, 10.40

స్క్రీన్-3 – విరూపాక్ష - 10.00, 7.45
పొన్నియన్ సెల్వన్ 2 - 1.05
ఉగ్రం - 4.35, 10.50

స్క్రీన్-4 – ఛత్రపతి (హిందీ) - 10.55
సంగీతం స్కూల్ - 1.40
భువన విజయం - 4.30
ది కేరళ స్టోరీ - 7.10
ఫర్హానా - 1.20

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూదన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ పి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899